# మన(సు)లో మాట

పిల్లలకు వేసవి సెలవులు కావడమువలన అంతా వారివారి సమయమును ఉల్లాసముగా గడుపుతున్నారని భావిస్తున్నాము. పిల్లలు కొత్త విషయములు నేర్చుకోడానికి ఇది మంచి తరుణము. సైన్స్ ప్రయోగాలు చేపట్టడము, గణితములోని సూత్రములు మెఱుగు పెట్టుకోవడము, కొత్త ఆటలు నేర్చుకోవడము, చిత్రలేఖనములాంటి ప్రక్రియలు వారిలో నైపుణ్యమును పెంచుతాయి. ఇకపోతే, ముఖచిత్రము, ప్రవాసాంధ్రుల పేజీ, బాలమిత్ర, నమ్మకం అంశాలు బాగున్నాయని చాలా మంది తెలియజేయడం సంతోషం. ఒక పాఠకుడు ఉత్తరంలో "ఈసారి సంఘమిత్ర మణిహారంలో అక్కడక్కడ సూక్తులు, రత్నాలు పొదిగిన చందంగా ఉంది." అని తెలియజేసారు. వారి అభిమానానికి ధన్యవాదములు. సంఘమిత్ర ముఖచిత్రముగా ప్రచురించే నిమిత్తము పలువురు పంపిన ఛాయాచిత్రములు బాగున్నాయి. కాకపోతే అందులో కొన్నిటి నాణ్యతను దృష్టిలో ఉంచుకుని ప్రచురించలేకపోతున్నాము. ఎవరైనా సంఘమిత్ర పత్రిక ముఖచిత్రమును చూడగానే అసంకల్పితముగానైనా "అబ్బా! ఎంతబాగుందో!!" అనేట్లు ఉండాలని మా ఆశయము. కావున, అవకాశమున్నంతవరకు మంచి నాణ్యతకలిగిన చిత్రములను పంపమని మనవి. ప్రస్తుతము సంఘమిత్ర వర్గము - మన పండుగలను గురించిన విశేషములు వ్రాసేవారి కోసం, చరిత్రలోస్థానమును ఏర్పరచుకొన్న మన పూర్వీకులను గురించి, వివిధ సంస్థలు నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమములగురించి వ్రాసేవారికోసం చూస్తోంది. మీరు ఈ విషయములో చేయూతనివ్వదలిస్తే, దయచేసి susri@sanghamitra.org కి ఈ-మెయిలు పంపించండి.

ఈ సంవత్సరము కూడా "శ్రీనివాస రామానుజన్ మేథమేటిక్స్ క్లబ్" విజయవంతంగా ప్రారంభమయ్యింది. నూతన యువ(తరంగం) శక్తి మమ్ములను ముగ్ధులను చేస్తున్నది. వారి కొత్త విషయములను తెలుసుకోవాలనే ఉబలాటము మాకు సవాలుగా పరిణమిస్తున్నది. నాలుగవ తరగతి నుండి పదవ తరగతివరకు పన్నెండుకు మించి పిల్లలు, చిన్న పిల్లలు ఆరుగురు కుతూహలంతో ఈ తరగతులకు హాజరవుతున్నారు. వీరంతా ఆగష్టు 2వ తారీఖున నిర్వహించబడే మేధావధానము 2008 కార్యక్రమములో పాల్గొనడానికి సన్నద్ధులవుతున్నారు.

"సరదాగా తెలుగు నేర్చుకుందాం!" కార్యక్రమానికి చాలా తక్కువ మంది హాజరైనప్పటికీ, చక్కగా నిర్వహించబడినది. ఈ కార్యక్రములో పాల్గొన్న పిల్లలు కథలు విని, పొడుపు కథలకు విడుపును తెలియజెప్పి ఎంతో ఆనందించారు. ఆశ్చర్యమును కలిగిస్తూ - కొన్ని కథలు, పొడుపుకథలను వారే సొంతంగా చెప్పడం జరిగింది. అది చూసి, విని ఆనందించాలేగాని, వర్ణించడం చాలా కష్టం. ఇక "అందరికీ కథాకాలక్షేపం" కార్యక్రమం జులై 13వ తారీఖున జరగనుంది.

మళ్ళీ అక్టోబరు సంచికలో కలుద్దామా! అంతవరకు సెలవు. అభినందనలతో ...

సంఘమిత్ర సంపాదక వర్గం.